క్లుప్తంగా

కూలిన పైకప్పు



కూలిన పాఠశాల భవనం పైకప్పు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లిలో గల ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు గురువారం కూలిపోయింది. పాఠశాలలకు సెలవు కాబట్టి ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ రాజ్‌కుమార్ ఉన్నతాధికారులకు విషయం తెలియజేశారు. నూతన భవనం నిర్మించాలని ప్రజాప్రతినిధులు లంకలపల్లి శ్రీనివాసరావు, జలపార శివ, వి. వెంకటప్పారావు కోరారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగపరుచుకోవాలి

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎన్ని వాహని సూచించారు. మండలంలోని సింగన్నవలస, వెలగవాడ ఆర్‌బీకేలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అవసరమైన విత్తనాలు తీసుకుని సాగు చేపట్టాలన్నారు. సలహాలు, సూచనలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ (విజయనగరం) జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుపల్లి, పేడాడ, రాజుల తమ్మాపురం, గంట్లాం, చిన అమకాం, అమకాం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు, కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

రేగిడి: విత్తనాలు కావాల్సిన రైతులంతా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ఆమదాలవలస, దేవుదళ, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం, చాటాయివలస తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటపొలం వివరాలు, రైతుల ఆధార్‌కార్డు నంబర్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్న సాగు సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

రేగిడి: గర్భిణులు, చిన్నారులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోహినీరాఘవ్ తెలిపారు. మండలంలోని వండానపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలను ఆమె ఇచ్చారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

రాజాం సిటీ: పట్టణంలో ఏర్పడిన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తాగునీటి బోర్లు మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. తరచూ తాగునీటి పైపులైన్ పాడవ్వడంతో పాటు సంకిలి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు పట్టణంలో పాడైన బోర్లును గుర్తించి, వాటిని బాగుచేయిస్తున్నామన్నారు. స్థానిక తాణా వీధిలోని బోరును మెకానిక్‌లు శ్రీనివాస్, సత్యనారాయణ, అప్పలరాజులు గురువారం బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

దుకాణాలున్నా.. ఆదాయం అంతంత మాత్రమే

- నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న షాపులు
- లైసెన్స్‌లు తీసుకోవడంలో అలసత్వం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కార్పొరేషన్ అధికారులు



నగరంలోని దుకాణ సముదాయాలు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఖజానాకు ఆదాయం సమకూరడం లేదు. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరంలో ఎక్కడ పడితే అక్కడ వివిధ రకాల దుకాణాలున్నపటికీ లైసెన్సు లేకుండానే వ్యాపారాలు సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతి ఏడాదీ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. నిబంధనల ప్రకారం నగరంలో ఏ దుకాణం నడపాలన్నా కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం నిర్ణయించిన నగదు చెల్లించాల్సి ఉంటుంది. అయితే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్స్ మంజూరు ప్రక్రియపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి లైసెన్స్‌ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి, ఆదాయం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వసూళ్లలో వైఫల్యం...

కార్పొరేషన్ ఖజానాకు ప్రతి ఏడాదీ ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో రావాల్సిన ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. 2018-19 సంవత్సరం నుంచి పరిశీలిస్తే అప్పట్లో 1600 వరకు దుకాణాలు, షాపులు ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి వస్తే.. 2022-23 సంవత్సరం నాటికి ఆ సంఖ్య 2,219కి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పాత, కొత్త బకాయిలు కలుపుకుని రూ.1.50 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.13.23 లక్షలు మాత్రమే వసూలైంది. 2018 - 19 సంవత్సరంలో రూ.18.77 లక్షల డిమాండ్‌కు గాను రూ.12.51 లక్షలు.. 2019- 20లో రూ.20.13 లక్షలకు గాను రూ. 13.52 లక్షలు.. 2020-21లో రూ. 20.39 లక్షలకు గాను రూ.12.13 లక్షలు .. 2021- 22లో రూ.21.49 లక్షలకు గాను రూ. 11.22 లక్షలు.. 2022-23లో రూ. 25.03 లక్షలకు గాను రూ.13.23 లక్షలు మాత్రమే వసూలు కావడం గమనార్హం. అదేవిధంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.24.12 లక్షలకు గాను రూ.12.37 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగారు.

ఆదాయం పెరగదేం...?

జిల్లా కేంద్రం, ఆపై కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరం విజయనగరం. ఆ స్థాయికి తగ్గట్లే స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేశారు. గడిచిన ఐదేళ్లలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నగర రూపురేఖలు చాలా వరకు మారాయి. పెద్ద పెద్ద నగరాలకు దీటుగా ప్రధాన కూడళ్లు సందరంగా రూపుదిద్దుకున్నాయి. ఈ భారాన్ని అధిగమించేందుకు వీలుగా ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, కల్యాణ మంటపాలు, మొబైల్ షోరూమ్‌లు, టిఫిన్ సెంటర్లు, వాహన షోరూమ్‌లు, రిపేర్ సెంటర్లు, తదితర దుకాణాలు ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి వస్తుండగా... ఆ స్థాయిలో ఆదాయం మాత్రం సమకూరడం లేదు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

నగరంలో వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణదారుడు, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. విస్తరిస్తున్న నగరంలో రోజురోజుకూ దుకాణాల సంఖ్య పెరుగుతోంది. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి తీసుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

అందరి సహకారంతో విజయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

- టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషితోనే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించిందని టీడీపీ విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. పట్టణంలోని అశోక్ బంగ్లాలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలు, నాయకులు అధైర్య పడకుండా పార్టీకి అండగా నిలిచారని కొనియాడారు. వారి సహకారంతోనే ప్రభుత్వంపై పోరాటం చేసి, విజయం సాధించామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కర్రోతు నరసింగరావు, పిళ్లా విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు



నూకరాజు, ఆర్‌ఓ

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అందరికీ ఆర్‌ఓ నూకరాజు ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటినుంచి నామినేషన్లు, ప్రచారం, పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్నివర్గాల ప్రజలు సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎలక్షన్ డీటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆలోచించు మిత్రమా...



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ సింగిల్ హ్యాండ్ డ్రైవింగ్



కోట ప్రాంతంలో సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్న వాహన చోదకుడు



హలో...హలో అంటూ వాహనం నడుపుతున్న చోదకుడు

ఎంతో జాగ్రత్తగా ప్రయాణం చేస్తేనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు చేయడం.. హెల్మెట్ ధరించకపోవడం .. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారు. కళ్లముందే ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా వారిలో మార్పు రాకపోవడం శోచనీయం. జిల్లా కేంద్రంలో పలువురు వాహనదారులు గురువారం సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చూసేవారిని గగుర్పాటుకు గురిచేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



వెనుక వాహనం వస్తుందన్న విషయం మరిచి సెల్ చూస్తున్న వాహనదారుడు





రింగ్‌రోడ్డులో ప్రమాదకర ప్రయాణం



దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించండి

- ఎంఈఓ పాపినాయుడు



చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పాపినాయుడు, తదితరులు

పూసపాటిరేగ : బడిఈడు ఉన్న దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బి. పాపినాయుడు అన్నారు. మండలంలోని పూసపాటిపాలెంలో విద్యాశాఖ - సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలు సాధారణ పిల్లలతో సమానంగా కలిసి విద్య నేర్చుకోవాలన్నారు. వీరికి పాఠశాలల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లల కోసం ప్రత్యేక కేంద్రం నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్కడ ప్రత్యేక ఉపకరణాలతో బోధన చేపట్టడంతో పాటు ప్రతి వారం ఫిజియోథెరపీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఎస్. బంగారునాయుడు, ఎం. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, తదితరులు

విజయనగరం టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపైనా ఉందని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. గురువారం స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకుని ఎన్‌సీసీ క్యాడెట్లు, కళాశాల అధ్యాపకులు మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి మాట్లాడుతూ.. మన ఇంటి పరిసరాలను, మన వర్క్‌ప్లేస్‌ను పచ్చదనంతో నింపాలన్నారు. ఇండోర్ మొక్కలను కూడా విరివిగా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎం. ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన



పిల్లలతో ఇంగ్లిష్ పదాలు రాయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి విద్యార్థులకు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై గురువారం అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివించడం, రాయించడం, వాటి అర్థాలు చెప్పడం వంటివి చేయించారు. స్పోకెన్ ఇంగ్లిష్ బాగా నేర్చుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచి ఇంగ్లిష్ మాట్లాడడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం పుస్తకాల ప్రదర్శన చేపట్టి, చిన్నారులతో కప్పగెంతులు ఆట ఆడించారు. కార్యక్రమంలో పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300



వావిలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని తాటిపాడు, వావిలవలస గ్రామాల్లోని మంచినీటి కోనేరుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనదారులు రెండు పూటలా పనులు చేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. వేరే వారి పేరు మీద ఇతరులను పనిలోకి రానివ్వద్దన్నారు. వడదెబ్బ బారినపడకుండా ఉండాలని, వర్షాలు కురిసే సూచనలు కనిపించినప్పుడు వెంటనే ఇంటికి వెళ్లిపోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజ్

వంగర: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమైన ఆయన.. ఖరీఫ్ సాగు పనులకు ముందే సాగునీటి ప్రవాహం జోరుగా సాగేలా ప్రధాన కాలువలు, పిల్లకాలువలను బాగు చేయాలన్నారు. పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు. ఫారంపాండ్‌ల నిర్మాణం, ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీవో హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తున్న ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు గురువారం తెలిపారు. ఇప్పటికే పైపులైన్‌ను విశాఖపట్నం నుంచి తెప్పించామని, దాని వెల్డింగ్ పనులు పూర్తి చేసిన వెంటనే పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. అమ్మవారి కాలనీ, మెంటిపేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, మాదిగవీధి, బొబ్బిలి రోడ్డు, తెలగవీధి, చాకలివీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, మల్లిఖార్జునకాలనీ, లచ్చయ్యపేట ప్రాంతాలకు మాత్రమే నీటిని నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని ప్రజలను కోరారు.